క్లుప్తంగా

మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో పూజలు



బంగారు, వెండి పుష్పాలతో అమ్మవారికి పూజలు చేస్తున్న పండితులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహన రావు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు, బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు ఉచిత హోమియో వైద్య శిబిరం

సామర్లకోట: పీబీ దేవం గ్రామంలో శనివారం ఉచిత హోమియో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు శారదా రామకృష్ణ సేవా సమితి కార్యదర్శి వింజమూరి విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విశ్వమానవతా సంస్థ ఆధ్వర్యంలో ఈ శిబిరం జరుగుతుందన్నారు. హోమియో వైద్యం ద్వారా అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధులు దూరమవుతాయని, దీనిపై సంస్థ ప్రతినిధులు అవగాహన కల్పిస్తారని చెప్పారు. అనేక అనారోగ్య సమస్యలకు మందులు ఉచితంగా ఇస్తారన్నారు. పిల్లలు, పెద్దలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు.

దేవమ్మ ఆలయంలో అన్నదానం

సామర్లకోట: పీబీ దేవం గ్రామంలో ఉన్న బొబ్బిలి దేవమ్మ ఆలయంలో దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం భారీ అన్నదానం నిర్వహించారు. గ్రామంలోని చిన్నరేవు పొలాల మధ్య వ్యాపారవేత్త చందవోలు వీరవెంకట సత్యనారాయణమూర్తి, రైతుల సహకారంతో ఆలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు, హోమాలు నిర్వహించారు. కమిటీ నాయకులు తోటకూర పెద్దరామారావు, సత్తిబాబు, బండారు కొండ, కట్టా చక్రరావు, తిరంశెట్టి సతీష్ భక్తులకు సేవలందించారు.

చలివేంద్రం ప్రారంభం



పవరలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

సామర్లకోట: పవర గ్రామంలో మినరల్ కూలింగ్ వాటర్ టిన్నులతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. లివింగ్ డీడ్స్ సేవా సంస్థ డైరెక్టర్ మడికి విజయకుమార్, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మడికి సోనియా ఆధ్వర్యంలో శుక్రవారం ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఎన్‌హెచ్–216లో ప్రయాణికుల ఇబ్బందులను గమనించి, ఈ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. సర్పంచ్ నాగనబోయిన సీతామహాలక్ష్మి, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ నాగనబోయిన రాజబాబు, వీరంరెడ్డి ఆనంద్, బాబ్జి, రతన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సుగుణారెడ్డికి ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న సుగుణారెడ్డి(ఎడమ వైపు)

బాలాజీచెరువు: ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్.సుగుణారెడ్డి ఐఐఎం కోల్‌కతాలో ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ పురస్కారం అందుకున్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) కోల్‌కతా 11 నెలల కాల పరిమితితో ఏడీలీప్ పోగ్రామింగ్ కోర్సు నిర్వహించింది. ఈ కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన సుగుణారెడ్డికి ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ పురస్కారాన్ని అందజేశారు. ఈ పోగ్రాం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న విద్యారంగ ప్రముఖులు, నిపుణుల అభిప్రాయాలు పంచుకోవడానికి మంచి వేదిక ఏర్పడిందని సుగుణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం డాక్టర్ సుగుణారెడ్డిని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

ఎస్ఈబీ దాడుల్లో ఒకరి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ-సెబ్) పరిధిలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో మద్యంతో ఒకరిని అరెస్టు చేసినట్టు స్థానిక సెబ్ సీఐ ఎల్.చిరంజీవి తెలిపారు. శంఖవరం మండలం కత్తిపూడిలో బెల్ట్ షాపుపై దాడి చేసి, మద్యం విక్రయిస్తున్న నాగెళ్ల నాగేశ్వరరావును అరెస్టు చేశామన్నారు. అతని నుంచి 3.6 లీటర్ల యానాం మద్యం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో సారా స్థావరంపై దాడి చేసి, సారా తయారీకి సిద్ధం చేసిన 600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

వరి వడిగా.. సేకరణ

- ఆర్‌బీకే ద్వారా జోరుగా ధాన్యం కొనుగోళ్లు
- దళారుల ప్రమేయం లేకుండా నేరుగా విక్రయించుకునే అవకాశం
- రైతులకు లభించనున్న కనీస మద్దతు ధర



చిత్రాడ ఆర్‌బీకేలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద సిబ్బంది



ఆరబెట్టిన ధాన్యం

పిఠాపురం: రైతులు ఆరుగాలం శ్రమించి చెమటోడ్చి పండించిన ధాన్యం అమ్ముకోవడం ఒక పెద్ద యుద్ధమే. పకృతి వైపరీత్యాలు, తెగుళ్ల నుంచి కాపాడుకున్న పంట చేతికందినా దానికి మద్దతు ధర లేక పోవడం, కొనే నాథుడు కనిపించక పోవడం, ఒక వేళ ఉన్నా దళారుల ద్వారా మాత్రమే కొనడం వంటి విపత్కర పరిస్థితుల్లో వచ్చిన కాడకే పంటను అమ్ముకోవడం తప్ప వేరే గత్యంతరం లేని పరిస్థితి ఉండేది. అలా అమ్మినా దళారులు అరువు పెట్టి డబ్బులు ఇవ్వకుండా ఎగ్గొట్టిన సందర్భాలు ఉన్నాయి. పెట్టిన పెట్టుబడి రాక పంట డబ్బు చేతికందక అప్పులు బాధలు ఎక్కువై నరకం చవి చూసే రైతన్నకు అండగా నిలుస్తున్నాయి రైతు భరోసా కేంద్రాలు. ప్రస్తుతం రైతులు సదూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇంటి పక్కనే తనపొలం ఉన్న ఊళ్లోనే ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా విక్రయిస్తున్నారు . రైతు భరోసా కేంద్రానికి రండి మీ పంటను కనీస మద్దతు ధరకు అమ్మండి.. మమ్మల్ని నమ్మండి, మీకు మేము భరోసా ఇస్తున్నాం. మీరు అమ్మిన పంటల డబ్బును మీకు పువ్వుల్లో పెట్టి ఇస్తాం అంటూ రైతు భరోసా కేంద్రాల సిబ్బంది రైతుల వద్దకే వెళ్లి భరోసా కల్పించి దళారుల ప్రమేయం లేకుండా పంటను కొనుగోలు చేస్తుండడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

46 రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు

గ్రామాల్లోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లోనూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. పిఠాపురం నియోజకవర్గంలోని కొత్తపల్లి, గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లో 46 రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రారంభమయ్యాయి. దీంతో రైతులు తమ పంటను ఆయా కేంద్రాలకు తరలించి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం రబీ మాసూళ్లు ముమ్మరంగా జరుగుతుండగా రైతులు ఆర్‌బీకేల ద్వారానే ధాన్యం విక్రయించడానికి ఆసక్తి చూపుతున్నారు.

మండలాల వారీగా ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల వివరాలు

మండలం	కొనుగోలు కేంద్రాలు
కొత్తపల్లి	15
గొల్లప్రోలు	9
పిఠాపురం	22
కనీస మద్దతు ధర	
సాధారణ రకం క్వింటాల్‌కు	రూ.2,183
75 కేజీల బస్తాకు	రూ.1,637
40 కేజీల బస్తాకు	రూ.873
గ్రేడ్ ఏ రకం	
క్వింటాల్‌కు	రూ.2,203
75 కేజీలకు	రూ.1,652
40 కేజీలకు	రూ.881

దళారులు, మిల్లర్ల ప్రమేయం లేని కొనుగోళ్లు

దళారులు, మిల్లర్ల ప్రమేయం లేకుండా ఎటువంటి మోసాలకు తావు లేకుండా రైతు భరోసా కేంద్రాల్లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం చేశాం. ఆర్బీకేల సిబ్బంది పంట పండించిన రైతుల వద్దకు వెళ్లి వివరాలు సేకరించి వారికి సమాచారం ఇవ్వడంతో రైతులు తమ ధాన్యాన్ని ఆర్బీకేల ద్వారానే అమ్మడానికి ఉత్సాహం చూపుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్నిరకాల వసతులు కల్పించాం. సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. రైతులకు ఎటువంటి నష్టం లేకుండా ధాన్యం కొనుగోలు చేసే విధంగా అన్ని చర్యలు తీసుకున్నాం. దళారులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ధాన్యం విక్రయించుకోండి అంటూ ఇప్పటికే గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాం. రైతుల నుంచి మంచి స్పందన వస్తోంది. ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో రైతులు ధాన్యాన్ని బాగా ఆరబెట్టి తెస్తున్నారు. దాని వల్ల తేమ శాతం తగ్గి మంచి మద్దతు ధర లభిస్తుంది.

– స్వాతి, ఏడీఏ, పిఠాపురం

వైఎస్సార్ సీపీలోకి మాజీ కౌన్సిలర్లు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో దవులూరి దొరబాబు తదితరులు

సామర్లకోట: టీడీపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన మాజీ కౌన్సిలర్లు శుక్రవారం వైఎస్సార్ సీపీలోకి చేరారు. స్థానిక వైఎస్సార్ సీపీ క్యాంప్ కార్యాలయంలో పార్టీ పెద్దాపురం అసెంబ్లీ అభ్యర్థి దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో టీడీపీ మాజీ కౌన్సిలర్ కేతా వెంకటలక్ష్మితో పాటు, ఆమె భర్త సాయిశంకర్, కాంగ్రెస్ కౌన్సిలర్లు నీలం శివశంకర్, నరవ మోహన్‌కుమార్‌తో పాటు, కేతా సుబ్బారావు, వెట్టి ఆనంద్ వైఎస్సార్ సీపీలోకి చేరారు. వీరికి దొరబాబు పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీలో పేదలకు, బీసీలకు న్యాయం జరగడంతో, ఎన్నికల్లో పెద్దాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలని పార్టీలోకి చేరినట్టు మాజీ కౌన్సిలర్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్‌కుమార్, భారతమాత సేవా పరిషత్తు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గుణ్ణం రాజబ్బాయి, పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధికి పట్టం కట్టండి



దివిలిలో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న దొరబాబు

- పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థి దొరబాబు
- దివిలిలో ఎన్నికల ప్రచారం

పెద్దాపురం: రాష్ట్రంలో జరిగిన సంక్షేమాభివృద్ధిని గుర్తించి సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేసి పట్టం కట్టాలని పార్టీ పెద్దాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు కోరారు. విజయ సంకల్ప యాత్ర పేరిట ఆయన శుక్రవారం మండలంలోని దివిలిలో ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా గ్రామ పార్టీ నాయకులు నరాలశెట్టి త్రినాథ్, సర్పంచ్ శ్రీనివాస్; ఉప సర్పంచ్ విజ్జపురెడ్డి రమేష్, ఎంపీటీసీ భద్రరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ.. మీలో ఒక్కడినని, స్థానికుడిగా నియోజకవర్గ ప్రజలకు పరిచయస్తుడైన తనను ప్రతిఒక్కరూ ఆదరించి, ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. ఆయా పథకాలు కొనసాగాలంటే మరోదఫా వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. స్థానికంగా ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన తనకుందని, తనను ఎమ్మెల్యే అభ్యర్థిగా, కాకినాడ పార్లమెంట్ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్‌కు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ గోపు మురళి, కనపర్తి చీమదొర, బాబి, పెంటా విజయ్‌కుమార్, ఇనకొండ వీరవిష్ణుచక్రం, తుమ్మల అచ్యుతరామయ్య, సుందరెడ్డి రాజు, నాగబోయిన రాజుబాబు, మలపరెడ్డి లోవ, జట్లా మోహన్, చేదులూరి చెల్లారావు, వట్టికూటి రాజ్‌కుమార్, మెండి శ్రీను, కుంచే అమరావతి, వారా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయ్

- వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత
- వాకతిప్పలో ఎంపీ అభ్యర్థి సునీల్‌తో కలిసి ఎన్నికల ప్రచారం



వాకతిప్పలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వంగా గీత, చలమలశెట్టి సునీల్

కొత్తపల్లి: ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపిస్తాయని ఆ పార్టీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అన్నారు. మండలంలోని వాకతిప్ప, కుతుకుడుమిల్లి, పొన్నాడ శివారు శీలంవారి పాలెం గ్రామాల్లో శుక్రవారం పార్టీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌తో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్ళి ఓట్లు అభ్యర్థించారు. అవ్వాతాతలు, మహిళలను ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా వంగా గీత మాట్లాడుతూ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేశారన్నారు. తమ ప్రభుత్వంలో అందరికీ మేలు జరగడంతో వైఎస్సార్ సీపీకి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. ఎంపీ అభ్యర్థి సునీల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేశారన్నారు. ఆయన చేసిన సంక్షేమమే 80 శాతం పార్టీ విజయానికి దోహదపడుతుందన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా వైఎస్సార్ పార్టీ విజయాన్ని అడ్డుకోలేరన్నారు. తొలుత యండపల్లి జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చేనేత కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచులు పొలాని దొరబాబు, కర్రి చిన్నారావు, బండి రాణి, ఎంపీటీసీ దాకే నాగమహేశ్వరి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వైస్ ఎంపీపీలు మాదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిన సురేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, వైఎస్సార్ సీపీ నేతలు జ్యోతుల చక్రబ్బాయి, దాకే రాజ్‌కుమార్, వడిశెట్టి నారాయణరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు గోపి హరిబాబు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో భాగంగా వాకతిప్పలో వరి పంటను కోస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



రమణక్కపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఓ జోగిరాజు

కొత్తపల్లి: రైతు భరోసా కేంద్రాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జోగిరాజు సూచించారు. మండలంలోని రమణక్కపేట రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 18 రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రాల్లో సన్న రకాలు మినహా అన్ని రకాల ధాన్యాన్ని కొనుగోలు చేస్తారన్నారు. రైతులు వీటిని వినియోగించుకోవాలని సూచించారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న మట్టి ట్రాక్టర్లు

కిర్లంపూడి: అనుమతులు లేకుండా మట్టి అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై షేక్ జబీర్ హెచ్చరించారు. అనధికారికంగా మట్టిని రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం అర్ధరాత్రి సింహాద్రిపురం అడ్డు రోడ్డులో పోలీసులు పట్టుకున్నారు. మైనింగ్ డిపార్ట్‌మెంట్ నుంచి ఎటువంటి అనుమతి పత్రాలు వారి వద్ద లేకపోవడంతో కేసు నమోదు చేసి తహసీల్దార్ కార్యాలయానికి రిపోర్టు పంపారు.

పంచారామ క్షేత్రంలో తెలంగాణ చీఫ్ సెక్రటరీ పూజలు



శాంతకుమారికి ఆశీర్వచనాలు అందజేసిన పండితులు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం తెలంగాణ చీఫ్ సెక్రటరీ శాంతకుమారి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయ మర్యాదలతో ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలోని కాలభైరవస్వామి, ధ్వజస్తంభం, పెద్ద నంది, ఉప ఆలయాలు, మూలవిరాట్లను దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజలు అనంతరం ఆలయ పండితులు చీఫ్ సెక్రటరీకి ఆశీర్వచనాలు అందజేశారు. స్వామివారి ఫొటో, ప్రసాదాన్ని ఈఓ అందజేశారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఏసీ పులి నారాయణమూర్తి, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎరియర్స్ అందజేత

కరప: గతేడాది తన ఇంటి వద్ద గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం(పీఏసీఎస్) సీఈఓగా పనిచేసిన చోడపునీడి మంగతాయారు మృతి చెందారు. ఆమెకు రావాల్సిన గ్రాట్యుటీ సొమ్ము రూ.1.03 లక్షలు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ సొమ్ము రూ.1.09 లక్షలు వెరసి రూ.2.12 లక్షలను సొసైటీ తరఫున శుక్రవారం ఆమె భర్త గౌతు వీరవెంకట దుర్గారావుకు పీఏసీఎస్ చైర్మన్ నక్కా వీరభద్రరావు అందజేశారు. పీఏసీఎస్ సీఈఓ పంపన వెంకటరమణ, మాజీ సీఈఓ చోడపునీడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

కోటనందూరు: మండలంలోని పాతకొట్టాం పంచాయతీ పరిధిలోని కేఏస్ కొత్తూరులో శుక్రవారం గడ్డివామి దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్లితే..గ్రామానికి చెందిన పైల దాలినాయుడు 2.8 ఎకరాల్లో వరి గడ్డిని కుప్ప వేశాడు. గడ్డివామి పైభాగంలో వెళ్తున్న 11 కేవీ విద్యుత్ తీగలు రాజుకోవడంతో.. ఆ నిప్పు రవ్వలు గడ్డివామిపై పడి ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న తుని అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. పంచాయతీ కార్యదర్శి కుశిరెడ్డి అప్పలరాజు, వీఆర్వో తోట లక్ష్మణరావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రమాదంలో రూ.20 వేల మేర నష్టం వాటిల్లినట్టు బాధిత రైతు దాలినాయుడు తెలిపారు.

కులరహిత సమాజానికి జగ్జీవన్‌రామ్ కృషి



సామర్లకోట జగ్జీవన్ రామ్ జయంతి సభలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

- వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి దొరబాబు

సామర్లకోట: దేశంలో కులరహిత సమాజానికి బాబూ జగ్జీవన్ రామ్ కృషి చేశారని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా అరుంధతి సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కుమ్మర వీధిలో ఏర్పాటు చేసిన జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం జగ్జీవన్ రామ్ విశేష కృషి చేశారన్నారు. తొలి ఉప ప్రధానిగా, కార్మిక శాఖ మంత్రిగా, రాజ్యాంగ పరిషత్తు సభ్యునిగా విశేష సేవలందించారన్నారు. ప్రతిఒక్కరూ ఆయన ఆశయ సాధన కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాదిగ సంఘ నాయకులు ఏర్పాటు చేసిన కేక్‌ను దొరబాబు కట్ చేశారు. మాదిగ సంఘ రాష్ట్ర నాయకులు పలివెల జనార్దన్, కాళ్ల లక్ష్మీనారాయణ, కాతేటి అరుణ్‌కుమార్, వల్లూరి నాని, కాపవరపు కుమార్, భారతమాత సేవా పరిషత్తు అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర మాట్లాడుతూ జగ్జీవన్ రామ్‌కు భారతరత్న అవార్డు ఇవ్వకపోవడం దారుణమన్నారు. అన్నదాన కార్యక్రమంలో దొరబాబు భోజనాలు వడ్డించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్ అధ్యక్షత వహించగా, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్-2 గోకిన సునేత్రాదేవి, పార్టీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శులు మడికి సోనియా, మైలవరపు జానీ మోజెస్, మాల మహానాడు నాయకులు లింగం శివప్రసాద్, నేతల హరిబాబు, పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జె.రామారావు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు.

అర్బన్, రూరల్ ప్రాంతాల్లో..

పెద్దాపురం: బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. నిరంతరం దళితుల ఉద్ధరణకు జగ్జీవన్‌రామ్ పాటుపడ్డారని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశపు హాలులో ఆర్డీఓ జేఎస్ రామారావు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఏఓ సుబ్రహ్మణ్యం, డీటీ భానుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు. కొండయ్యపేటలో కౌన్సిలర్లు త్సలికి సత్య భాస్కరరావు, కట్టా రాజుబాబు తదితరులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. దివిలి గ్రామంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించిన స్థానిక యువకులు.. కాలనీలో స్వీట్లు పంచారు.

గొల్లప్రోలు: సంఘ సంస్కర్త, మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శుక్రవారం గొల్లప్రోలులో ఘనంగా జరిగాయి. స్థానిక అరుంధతీ పేటలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నగర పంచాయతీ వైస్ చైర్మన్ గంధం నాగేశ్వరరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జగజ్జీవ్‌రామ్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త గంధం చినబాబు, మన ఊరు–మన గొల్లప్రోలు గ్రూప్ సభ్యులు, గోరింట సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వాకతిప్ప, ఇసుకపల్లి, యండపల్లి గ్రామాలల్లో జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు స్థానిక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బలహీన వర్గాల కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మోర్త రవి, సిద్ధాంతపు బెన్‌జాన్సన్, సవరపు వీర్రాజు, దూలపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీఓ రామారావు తదితరులు

బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి

పిఠాపురం: బాబూజగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివని, అటువంటి మహనీయుడిని స్మరించుకోవడం గొప్ప విషయమని రిక్షా కార్మిక సంఘం నాయకులు పెదపాటి సత్యనారాయణ, నూకరాజు అన్నారు. పిఠాపురం–ఉప్పాడ బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం పిఠాపురం రిక్షా కార్మిక సంఘం ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. బాబూజగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పెదపాటి నాగేశ్వరరావు, రిక్షా కార్మిక సంఘం నాయకులు కొల్లు రాజబాబు, పి.రాజబ్బాయి, ఎస్.సత్తిబాబు, వై.నూకరాజు, సీహెచ్ సోమరాజు, సీఐటీయూ నాయకులు కుంచే చిన్న, కోనేటి రాజు తదితరులు పాల్గొన్నారు.



గొల్లప్రోలులో జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు, గ్రామస్తులు



వాకతిప్పలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నాయకుల నివాళి



పిఠాపురంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న రిక్షా కార్మిక సంఘం నాయకులు



కొండయ్యపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కౌన్సిలర్లు